వానవచ్చింది

వర్షాలు వచ్చేసినాయి!

పుడమితల్లిని తడుపుతూ, పూలజల్లుగా మొదలై సూదులు విరిసినట్టుగా మారి, నింగికి, నేలకి వారధికడుతున్నట్టుగా, ఏకధారగా, వుధృతంగా కురవటం ప్రారంభించినాయి.

వేసవికాలపు పొగలు, సెగలుతో, వుక్కిరి బిక్కిరి అయిన అందరూ, రాకరాక వచ్చిన అతిథిని చూసినట్టు వానజల్లుల్ని అపురూపంగా ఆనందంగా చూస్తున్నారు. కుంభవృష్టిగా మారిన ఆ వానలో తడుస్తూ హాయిని పొందుతున్నారు. దట్టంగా ఆకాశంలో నిండిపోయిన చిక్కటి నల్లటి మేఘాలని సంబరంగా చూస్తున్నారు.

ఆఫీసులనుంచి వచ్చేవాళ్ళు బస్‌స్టాప్‌లదగ్గర, అడుక్కునేవాళ్ళు చెట్లక్రింద, పనిమీద బజారు వచ్చినవాళ్ళు షాపుల చూరులక్రింద నిలబడి, హఠాత్తుగా వచ్చిన ఈ కుండపోతని విస్మయంగా పన్లు మానేసి నిలబడినట్టుగా చూస్తున్నారు.

ఆ వీధిలోకెల్లా అందమైన మేడ అది! దాని పై భాగంలో, పడకగది కిటికీకివున్న లేసు పరదాలని వజ్రపుటుంగరం మెరుస్తున్న చేతితో పక్కకి నెట్టి చూస్తోంది ఒక యువతి.

అదే వీధిలో, చిట్టచివర వీధి పంపుదగ్గర కుండలోకి నీళ్ళు నింపుకుంటున్న రత్తి పంపులో నీళ్ళతోపాటు, కుండలోకి కురుస్తున్న వాన ధారలని చూస్తోంది.

గాలి రంయ్యిన వీచింది.

మేడమీద గదిలో నిలబడిన ప్రమీల చెంపలమీద వచ్చిపడిన వాన జల్లుని, వెంకటగిరి జరీచీర కొంగుతో సుతారంగా అద్దుకుంది. క్రింద పంపు దగ్గర రత్తి తలలోనుంచి నీళ్ళు నుదుటమీదనుంచి కళ్ళవైపుకు కారుతుంటే కుడికాలు ఎత్తి కుండని తొడమీద ఆనించి ఎడమచేత్తో నీళ్ళు పక్కకి విదిలించింది.

అప్పుడే, ఆ వీధిలోకి ఖరీదయిన తెల్లటికారు, వాననీళ్ళలో యీదుతున్న పెద్దపడవలా మెల్లగా వస్తోంది. కారులో కూర్చున్న నీలం యూనిఫారం, తెల్లషైటు ధరించిన అబ్బాయి, వానని తదేకంగా చూస్తున్నాడు. ఆ కారుపక్కనుంచే పుస్తకాలసంచీ నెత్తినపెట్టుకొని, శీను పరుగెత్తుకు వస్తున్నాడు. కారు వెళ్ళడంలో వీధిలో నిండిన బురదనీళ్ళు చింది శీనుమీద పడ్డాయి. 'ఛీ!' నోటిదగ్గరకి అవి వచ్చి పడడంతో శీను చిరాకు పడ్డాడు. కారులో కూర్చున్న నీలంబట్టల అబ్బాయి పక్కన పళ్ళన్నీ కన్పించేలా నవ్వాడు. మేడమీద గదిలో నిలబడిన ప్రమీలకూడా శీను అవతారం చూసి పకాల్న నవ్వింది.

కారు ఇంటిముందుకువచ్చి ఆగింది. వానని చూస్తున్న ప్రమీల ఒక్కసారిగా, అదంతా మర్చిపోయినట్లుగా, గబాల్న గదిలోనుంచి ఇవతలికి వచ్చి, 'సుబ్బయ్యా! అబ్బాయి వచ్చాడు, గొడుగు తీసుకువెళ్ళు. రుక్కమ్మా! పాలు వేడిచేయి - బాబు బట్టలు ఇక్కడకు పట్టా' అంటూ కేకలు పెట్టింది.

అతి నిశ్శబ్దంగా ఉన్న ఆ యింట్లో, ఒక్కసారి చలనం వచ్చింది. నౌకర్లు పరుగులు పెడుతున్నట్లు పన్లు చేయసాగారు.

క్రిందివీధిలో రత్తి నీళ్ళకుండని భుజంమీదపెట్టి తీసుకువెళ్తూ 'శీనిగా! తొందరగాపోరా యింటికి' అంటూ మందలించింది. శీను వెళ్ళలేదు.

తల్లితోపాటే నడవసాగాడు. వాననీళ్ళు కాలితో తంతుంటే వాడికి చాలా సరదాగా వుంది.

'వానలో నానితే సచ్చిపోతావురా, పో' కసిరింది.

'ఏం సావను. నువ్వు తడవటంలేదేంటి ?'

'మొండియెదవా నడు, నడు' కొడుకుకోసం తన నడక తొందర చేసుకుంది.

అరగంట తర్వాత —

మేడమీద ప్రమీల కొడుకుని పాలుతాగమని బ్రతిమలాడుతోంది.

'మా బాబువిగా, తాగు. చల్లారిపోతాయి. అదుగో! ఆ శీను చూడు, మొలకిగోచీ ఎలా కట్టుకున్నాడో!' మేడమీద వరండాలో నిలబడి దూరంగా కన్పిస్తున్న పాకలో గుమ్మందగ్గర నిలబడిన శీనుని చూపిస్తూ అంది.

బాబు ఫక్కున నవ్వాడు. 'ఛీ! షేమ్‌కదూ! మమ్మీ'

'వాళ్ళకి సిగ్గుండదులే! వాడి పొట్టచూడు, కుండలా వుంది. కాళ్ళు పుల్లల్లా వున్నాయి.'

బాబు తల్లిమాటకి ఫక్కున నవ్వాడు. ప్రమీల కొడుక్కి మాటల సందడిలో పాలు తాగిస్తోంది.

క్రింది పాకలో. శీను ఏడుస్తున్నాడు. 'అమ్మా, నలేస్తుందే!'

గంజి వేడిచేస్తున్న రత్తి విసుక్కుంది. 'నన్ను సావమంటావురా. ఆ లాగు తడిపి ఆరేశాను. ఆరిసావలేదు. ఇదుగో, యిది యేడేడిది తాగు.'

'నాకేం వద్దులే.'

'మా బాబుగా! అదుగో, సూడ్రా, ఆ ఎఱ్ఱజాంపండు ఎట్టా వున్నదో, బుగ్గలేమో బూరిల్లా వున్నాయి. కళ్లేమో సచ్చిత్రాలు. ఆ మొకంలో నో రెక్కడుందో మనం ఎతుక్కోవాలిరా!'

రత్తి వర్ణిస్తుంటే, శీను మేడమీద బాబుని చూస్తూ గంజి తాగసాగాడు.

'అమ్మా! ఆ బాబుకేమో అంత మంచిబట్టలు - నాకేమో యీ గోచీ! ఛీ!' అన్నాడు శీను అసూయగా. రత్తి నిట్టూర్చింది.

'ఆ బాబుకేంరా! అదుష్టవంతుడు. యేలు సంపాయించే నాన్న వున్నాడు. నువ్వూ వున్నావు. మీ నాన్న నన్నొదిలి యింకోదాన్ని సేసుకుని కులుకుతున్నాడు. సచ్చానో, బతికానోగూడా సూడలేదు' రత్తికి ఏడుపు వచ్చేసింది.

'యేడవకే అమ్మా! నేను పెద్దయి ఆడిని తంతాలే!'

'మాబాబే' రత్తి కొడుకుని కౌగలించుకుంది.

చీకటయింది.

వాన జోరుకూడా ఎక్కువ అయింది! గాలికూడా తోడు కలవటంతో స్వైర విహారం సాగింది.

ఆకాశంలో వెలుగుపూలు పూసినట్టు అప్పుడప్పుడూ మెరుపులు మెరుస్తున్నాయి.

ప్రమీల పడుకోబోతూ, కిటికీరెక్కలు మూయటానికి అక్కడికి వచ్చింది.

దూరంగా, వీధిదీపపు కాంతిలో, వాన తెరలమధ్య గుడిసెలు లీలగా కన్పిస్తున్నాయి.

ఈ రాత్రంతా యిలాగే వానపడితే, ఆ గుడిసెల్లోకి నీళ్ళు వచ్చేస్తాయి. ఆ మనుషులు ఎలా బ్రతుకుతారో!

ప్రమీల కిటికీతలుపులు మూసి, పక్కమీదకువచ్చి పడుకుంది. మెత్తటి పరుపుమీద, వెచ్చటి రగ్గు కప్పుకుని పడుకున్నా యింకా వేడి సరిపోలేదు. భర్తదగ్గరకి జరిగి అతన్ని ఆనుకుని పడుకుంది.

గుడిసెలో శీను చలికి గడగడలాడుతున్నాడు. వాడికి కప్పటానికి రత్తికి ఆ పాకలో పాడిబట్ట ఏదీ కనిపించలేదు. వానవస్తే మేకకూడా ఆ గుడిసెలోనే వాళ్ళతోపాటు పడుకుంటుంది. రత్తి మేకకి పక్కగా ఎండుగడ్డి వేసింది. కొడుకు చలి చూడలేని రత్తి మేకనిలేపి, ఆ గడ్డి తెచ్చి శీనుకి

వేసింది. శీను ఆ గడ్డిలో పడుకున్నాడు. మేక మేమే అని చలికి అరుస్తూ ఆ గడ్డిలోకే వచ్చి ఒదిగిపడుకుంది. ఎంతసేపయిందో తెలియదు.

శీను లేచాడు. 'అమ్మా, అమ్మా' అంటూ పిలిచాడు.

రత్తి లెచింది. 'ఏంటిరా ?' అనే లోపలే శీను వాంతి చేసుకున్నాడు.

గాలికి దీపం ఆరిపోయింది.

వీధిదీపపు వెలుతురు గుడిసెలోకి జొరబడటానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

రత్తి శీనుకి నీళ్ళు తెచ్చింది.

శీనుకి వాంతులు తగ్గలేదు. అదిగాకుండా మాటిమాటికీ గుడిసె బైటకి వెళ్ళి వస్తున్నాడు.

రత్తికి భయంవేసింది. సాయంత్రం పంపుదగ్గర అమ్మలక్కలు వూరిలో మహమ్మారిలా వున్న కలరా గురించి మాట్లాడుకోవటం వింది.

ఏం చెయ్యటం ?

రత్తి శీనుని లేవదీసి భుజంమీద వేసుకుంది. డాక్టరుగారు రెండువీధుల అవతల వున్నాడు.

రత్తి గుడిసె యివతలకి వచ్చింది. వీధిలైటుకూడా పోయింది.

చీకటి ! వాన !

కానీ కొడుకు ప్రాణం గురించి ఆదుర్దా పడుతున్న రత్తికి అవేవీ ఆటంకాలుగా అనిపించటం లేదు ! శీనుని భుజాన వేసుకుని పడుతూ, లేస్తున్నట్టుగా, ఆ నీళ్ళలో ఈదుతున్నట్లుగా నడుస్తూ వెళుతోంది.

ఆ చీకట్లో ఆ డాక్టరుగారి యింటికి ఎట్లా చేరుకుందో రత్తికే తెలియదు.

రత్తి గొంతు చించుకున్నట్టుగా అరవగా, అరవగా, తలుపులు బాదగా, డాక్టరుగారి నౌకరు లేచివచ్చి తలుపు తీశాడు.

'డాక్టరుగారు లేరు ! మీ వీధిలోనే ప్రమీలమ్మ కొడుక్కి కలరాగా వుందని ఫోన్వస్తే వెళ్ళారు' అన్నాడు.

'అయ్యో! డాక్టరుగారు మా యీదికే వచ్చారా. నా కెదురు అవలేదే.' రత్తి మళ్ళీ అంతలోనే గుర్తుచేసుకుంది. 'అవునవును! నా కెట్లా ఎదురవుతారు. నేనేమో దగ్గరగందా అని యీరయ్యగారి సందంబడి వస్తిని!' అనుకుంది.

'దాక్టరుగారు యిప్పుడు రారు.' అన్నాడు నౌకరు.

'వచ్చేదాకా కూసుంటాను' అక్కడ కొడుకుని బెట్టుకుని కూర్చుంది.

శీను వాంతులు చూసి నౌకరు అసహ్యించుకున్నాడు.

'ఇదుగో! ఆయన అక్కడే వున్నాడుగా! ఆ ప్రమీలమ్మగారి యింటికే పో!' అని తలుపులు వేసేసుకున్నాడు.

రత్తి కొడుకు నెత్తుకుని లేచింది.

మళ్ళీ వాన నీళ్ళలో యీదుతున్నట్లుగా — ఈసారి డాక్టరుగారు ఎదురవుతారు అన్న ఆశతో, కారువచ్చే రోడ్డువెంట వచ్చింది.

రత్తి కొడుకు నెత్తుకుని వచ్చేసరికి, ప్రమీలమ్మ యింట్లో పట్టపగలులా, లైట్లు వెలుగుతున్నాయి. నౌకర్లందరూ గుమిగూడి, చినబాబు ఆరోగ్యం సంగతి మాట్లాడుకుంటున్నారు.

డాక్టరుగారు ఆ యింటికి వస్తుంటే, మధ్యదోవలో కారు చెడిపోయిందిట! ఆయన యిప్పుడే వచ్చారు! చాలా ఆలస్యం అయిపోయింది. చిన్నబాబుని అయ్యగారి కారులో అదేదో పెద్ద హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారుట! ఎప్పుడు తిరిగి వస్తారో తెలియదు. రత్తి కొడుక్కికూడా కలరా అనేసరికి వాళ్ళంతా దూరంగా తొలిగి నిలబడ్డారు.

శీను అప్పటికే వడిలిన తోటకూరకాడలా వేళ్ళాడిపోతున్నాడు.

వాడిని చూసి నౌకర్లంతా పెదివి విరిచారు.

'ఇంకేం మందులే, యింటికి తీసుకుపో!' అన్నారు.

రత్తి కొడుకుని భుజాన వేసుకుని పాకకి తిరికివచ్చింది.

రత్తి కళ్ళనుండి వానధారల్లా, నీళ్ళు కారుతున్నాయి. డాక్టర్ దొరకలేదు. మందుపడలేదు. అయిపోయింది. శీనుకి, తనకి రుణం తీరిపోయింది. రత్తి పాకలో, పొయ్యిపక్కగా కాస్త పొడిగా మిగిలిన జాగాలో ఎండుగడ్డి లాగి దానిమీద కొడుకుని పడుకోబెట్టింది. ఆ గడ్డిని చూడగానే రత్తి వెన్నెముక ఝల్లుమంది.

'పాపిష్టిదాన్ని! యిట్టా సేసానేంటి! అసలు గడ్డిమీద రాత్రి ఆడిని ఎందుకు పడుకోబెట్టాను. నా సేతులు పడిపోను' అని తిట్టుకుంది.

వీధిదీపం ఆరిపోయినా, ప్రమీలమ్మ ఇంట్లో లైట్లు వెలుగుతూండడంతో, గుడ్డివెలుతురు పాకలోకి వస్తోంది. రత్తి కళ్ళనుంచి నీళ్ళధారలు ఆగటంలేదు.

ఆ అమాయకహృదయం మూగగా దేవుడితో దెబ్బలాడుతోంది.

'ఆ పెమీలమ్మకి ఏం తక్కువని? ఈ డాక్టరు కాకపోతే ఇంకో డాక్టరు వచ్చేవాడు. కారుగల ఆసామి కొడుకుని ఎంతదూరం అయినా తీసుకెళ్ళి రచ్చించుకోగలదు. బగమంతుడా! నువ్వు మంచోడివికాదు! ఉన్నవాళ్ళకే అన్నీ యిస్తావు! నాకేం కారులు యిచ్చావా; మిద్దెలిచ్చావా? యేలు సంపాయించే బరత నిచ్చావా? యిచ్చింది ఈ నలుసు ఒక్కడు. వాడినికూడా లాక్కుని నన్ను యింకా బికారిని సెయి' రత్తికి ఆపుకోలేనంత ఏడుపు వచ్చేసింది. 'ఈడుకూడా లేకపోతే నా కెవరుదిక్కు?' అనుకుంటూ, 'శీనూ! శీనూ!' అంటూ ఒంటిమీద చేయివేసింది శీను పలకలేదు.

'శీనూ!' రత్తి ఘొల్లుమంటూ ఏడ్చిన ఏడుపు ఆ గాలిలో కలిసిపోయింది.

రాత్రి ఎట్టా గడిచిందో, వాన ఎప్పుడు ఆగిపోయిందో, తూర్పున ఎప్పుడు తెల తెలవారిందో రత్తికి తెలియనే తెలియదు. ఆ పాకలో స్మశానంలో కూర్చున్నట్టుగా కూర్చుంది.

'అబ్బా....అమ్మా....ఊ!' ఎక్కడినుంచో మూలుగు వినిపించింది. రత్తి యింకా ఆ పిలుపే వింటోంది.

'అమ్మా!' పాతాళలోకంనుంచి మాట్లాడుతున్నంత నీరసంగా శీను పిలుపు వినిపించింది.

పిచ్చిదానిలా కూర్చున్న రత్తి, వెఱ్ఱిచూపులతో గడ్డిమీద పడుకున్న కొడుకువైపు చూసింది.

'అమ్మా!' శీను పిలుస్తున్నాడు. బాధతో మూలుగుతున్నాడు. రత్తి కళ్ళు పత్తికాయల్లా అయినాయి.

'అబ్బా! ఊః!' మూలుగు స్పష్టంగా వినిపించింది. రత్తి లేచి వచ్చింది. శవం ప్రాణం పోసుకుని మళ్ళీ కదిలినంత ఆశ్చర్యంగా చూసింది.

'శీనూ! శీనిగా! ఒరే! చీనిగా!' ఒక్కసారిగా, కొడుకుమీదపడి ముఖం, చేతులు ముద్దులతో నింపేసింది. రత్తి ఏడుస్తోంది! కానీ ఆ ఏడుపులో ఎన్నడూ ఎరిగనంత సుఖం ఆనందం కనిపించసాగాయి! పదిగంటలు అయినాయి. మేకని బైట కట్టేసి, పాకని శుభ్రంచేసి, కుండ పుచ్చుకుని పంపుదగ్గరకి నీళ్ళకి వస్తున్న రత్తికి ఆ వీధి వీధంతా కారులతో నిండిపోవటం ఆశ్చర్యంగా అనిపించింది.

'అక్కా! ఏమయిందే?' అని పంపుదగ్గర నీళ్ళుతెస్తున్న యువతిని అడిగింది.

'అయ్యో! నీకు తెలియదా? రాత్రి పెమీలమ్మ కొడుకు పోయాడంట! కలరా తగిలిందిట! పాపం! ఒక్కడే కొడుకు.'

రత్తి నిశ్చేష్టురాలయినట్టు నిలబడిపోయింది.

వారంరోజులు గడిచినాయి.

రత్తి కొడుకుని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి తీసుకువెళ్ళి, తలనీలాలు యిప్పించి ఇంటికి తీసుకువస్తోంది.

ప్రమీల మేడమీద బాల్కనీలో కుర్చీలో కూర్చుని వుంది. మేడ, కారు, నగలు, నౌకర్లు, వేలు సంపాయించే భర్త - అన్నీవున్నా ప్రమీల కళ్ళలో ఏమీకాని బికారిలాంటి బీదతనం కనిపిస్తోంది. అవేవీ ఆమెకు సంతోషం కలిగించలేదు. ఆ కళ్ళలో అంతులేని శూన్యం, చెప్పలేని బాధ

కన్పిస్తున్నాయి. బాల్కనీలో కూర్చునివున్న ప్రమీల వీధిలోనుంచి వెడ్తున్న రత్తిని చూస్తోంది.

రత్తి ముఖం అష్టయిశ్వర్యాలు, తనకే వున్నంత అందంగా మెరిసిపోతోంది.

ఎందుకో తలెత్తి పెమీలమ్మ తనవైపే చూస్తుండటం చూసిన రత్తి, గుండుచేయించిన కొడుకుని భుజాలచుట్టూ చేయివేసి మరింతదగ్గరికి లాక్కుంది. పెమీలమ్మ ముఖం చూడగానే రత్తి కళ్ళలో చివ్వున నీళ్ళు చిమ్మినాయి. కడుపుకోత ఏ ఆడదానికైనా ఒకటే.

ప్రమీలమ్మ బంగళా దాటివచ్చేస్తున్న రత్తి, గబగబా కుడిచేత్తో చెంపలు వాయించుకుంది. 'బగమంతుడా! ఆ రాత్రి తొందరపడి నిన్ను తిట్టానయ్యా! తప్పు తప్పు! ఈ ప్రపంచంలో నువ్వు ఎవ్వరికీ అన్నీ యివ్వవు. ఏవో కొన్ని యిస్తావుసుమా!' అనుకుంది.